సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 12 । మార్చి । 2025



నిర్లక్ష్యపు చెదలు

పలాస కిడ్నీ ఆస్పత్రికి నిర్లక్ష్యపు చెదలు పడుతున్నాయి. రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు.

- 8లో



కేరాఫ్ దివ్యాంగులు

దివ్యాంగులు సహజ రంగులు తయారు చేస్తున్నారు. పూల రెక్కలతో రంగులు చేసున్నారు.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
బుధ (సా)	గురు (ఉ)
6.07	4.50

న్యూస్‌రీల్

బీసీ కార్పొరేషన్‌లో సబ్సిడీపై రుణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్ గడ్డెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 21-60 ఏళ్ల మధ్య వయసు కలిగి దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న బీసీలు, అగ్రవర్ణాల్లోని పేదలు, కుమ్మర, మేదర కులముల వారికి స్వయం ఉపాధి పథకాలు కోసం రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. రుణాలు పొందగోరు వారు http:apobmms.apcfss.in సైట్ లో మీ సేవా, ఇంటర్నెట్ సెంటర్ లేదా సంబంధిత సచివాలయంలో 22వ తేదీ లోగా నమోదుచేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి / మున్సిపల్ కమిషనర్ వారిని సంప్రదించాలని సూచించారు.

అగ్నికి ఆహుతైన ఆటో



మంటల్లో కాలిపోయిన ఆటో

ఇచ్ఛాపురం రూరల్‌: డొంకూరు-లక్ష్మీపురం మధ్య ఆటో అగ్నికి ఆహుతైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. డొంకూరు మత్స్యకార గ్రామానికి చెందిన పుక్కళ్ల రవి అనే యువకుడు గత కొంత కాలంగా ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ప్రయాణికులను ఒడిశాలో దింపి వస్తుండగా లక్ష్మీపురం గ్రామ సమీపంలో ఆటో నుంచి ఒక్క సారిగా మంటలు చెలరేగి క్షణాల్లో అగ్ని కీలలకు ఆటో దహనమైపోయింది. విషయం తెలుసుకున్న మత్స్యకార యూనియన్ ప్రతినిధి చీకటి కృష్ణ, ఆయన స్నేహితులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఏడాది కిందట ఫైనాన్స్‌పై రూ.మూడు లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆటో కాలిపోవడంతో తన జీవనం స్తంభించిపోయిందని రవి ఆవేదన వ్యక్తం చేశాడు.

త్వరలో కౌలు రైతులకు రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్



సత్యవరంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ స్వామి


నరసన్నపేట: భూమి ఉన్న ప్రతి రైతు డిజిటల్ గుర్తింపు సంఖ్య తీసుకోవాలని, త్వరలో కౌలు రైతులకు కూడా డిజిటల్ గుర్తింపు సంఖ్య మంజూరు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ స్వామి అన్నారు. మండలం సత్యవరం, తామరాపల్లి రైతు సేవా కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అన్ని సచివాలయాల్లో 60 శాతం వరకూ రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో ఆయన మిగిలిన వారినీ నమోదు చేయించి గుర్తింపు సంఖ్య కేటాయించాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలకూ ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య చాలా అవసరమని అన్నారు. రైతులకు అందుబాటులో ఉండాలని వీఏఏలకు ఆదేశించారు. రైతులతో మాట్లాడి వ్యవసాయ పంటలపై తగు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారిణి కె.సునీత పాల్గొన్నారు.

డీసీఎంఎస్ గోదాం పరిశీలన



గోదాంను పరిశీలిస్తున్న ఆహార కమిటీ సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం శ్రీకాకుళంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వం బాలికోన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం డీసీఎంఎస్ గోదాంకు వెళ్లి స్టాక్ పరిశీలించారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ సూర్య ప్రకాష్ రావు, డీఈఓ తిరుమల చైతన్య, ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతలు శాఖ సీఏస్‌డీటీ ఎస్.చక్రవర్తి, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెప్పిందేమిటి..?

బోత్ అర్ నాట్ సేమ్ తమ్ముళ్లు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి వ్యత్యాసం ఉంటుంది. ప్రతి యువతకు ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటాను. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తాను. ఉద్యోగం వచ్చే వరకు అమ్మానాన్నలపై ఆధారపడే పరిస్థితి లేదు. నెలకి రూ. 3వేల భృతి ఇస్తాం. మీ అకౌంట్‌లోకి వస్తుంది. వర్క్‌ఫ్రం హోమ్ పెడతాను. మీ ఇంట్లో కూర్చొని అమ్మానాన్నలను చూసుకుంటూ ప్రపంచంలో ఏ కంపెనీ కావాలంటే ఆ కంపెనీ పనిచేసుకునే సంస్కృతికి శ్రీకారం చుడతాను. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లిస్తాం. కళాశాలల ఖాతాల్లో నేరుగా జమ చేస్తాం.

– శ్రీకాకుళం ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి



చేసిందేమిటి..?

నిరుద్యోగ భృతికి అతీగతీ లేదు. జాబ్ క్యాలెండర్ గురించి మరిచేపోయారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి ఎదురుచూసీ చూసీ పది నెలలు దాటిపోయాయి. మరో రెండు నెలలు గడిస్తే విద్యా సంవత్సరం కూడా ముగుస్తుంది. కానీ సర్కారు మొద్దు నిద్ర వీడడం లేదు. కళాశాలల ఖాతాల్లో పైసా పడక నిర్వహణ కష్టమవుతోంది. వర్క్ ఫ్రమ్ హోమ్ సంగతి తర్వాత.. వర్క్ పోయి హోమ్‌కు పరిమితమైపోతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. నిజంగానే చంద్రబాబు అప్పట్లో అన్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వం బోత్ అర్ నాట్ సేమ్ తమ్ముళ్లూ అని జనం ఇప్పుడు అనుకుంటున్నారు. ఈ మోసంపై వైఎస్సార్ సీపీ పిడికిలి బిగించింది. దగా పడుతున్న యువత ఘోషను ప్రభుత్వానికి వినిపించేందుకు నేడు రోడ్డెక్కనుంది.



బోత్ ఆర్ నాట్ సేమ్

యువతను దగా చేసిన చంద్రబాబు ప్రభుత్వం | ఐదేళ్లు ఆదుకున్న వైఎస్ జగన్ సర్కారు

చంద్రబాబు చేతిలో మరోసారి మోసపోయిన యువత, నిరుద్యోగులు

- విద్యార్థులకు తప్పని ఫీజు కష్టాలు
- మూడు క్వార్టర్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయని పరిస్థితి
- అతీగతీ లేని నిరుద్యోగ భృతి
- యువతకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం
- 'యువత పోరు' పేరుతో నేడు నిరసనలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఫేస్‌బుక్ ఓపెన్ చేస్తే చాలు సర్కారు గురించి గొప్పలు, యూట్యూబ్ చూస్తే చాలు చెవులు మోగిపోయేలా గొప్పల డప్పులు, ఏ సామాజిక మాధ్యమం చూసినా చెప్పనలవి గాని ప్రచారాలు.. మరి క్షేత్రస్థాయిలో చూస్తే మాత్రం.. మూడు క్వార్టర్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురుచూపులు, విడుదల కాని మెయింటెనెన్స్ చార్జీలు. అంతేనా.. 'కల్పన'గానే మారిపోయిన ఉద్యోగాలు.. అమలు కాకుండా ఉండిపోయిన హామీలు.. ఊరూరా కక్ష సాధింపులు..వీధి వీధినా వేధింపులు. ఇదీ పది నెలల తర్వాత తేలిన కూటమి సర్కారు అసలు పనితనం. యువతను ఇంతలా దగా చేయడంపై వైఎస్సార్ సీపీ ఉద్యమానికి పిలుపునిచ్చింది. యువత పోరు పేరుతో బుధవారం ఆందోళనలు చేపట్టనుంది.

నిలువునా మోసం

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కష్టాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మూడు విడతల ఫీజులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బస్ చార్జీలు, డేస్కాలర్, స్టూడెంట్ మేనేజ్ వసతి గృహాల విద్యార్థులకు మెయింటినెన్స్ చార్జీలు రాకపోవడంతో పాఠ్యాంశాలపై దృష్టి పెట్టలేని పరిస్థితి. మరోవైపు ప్రభుత్వం నుంచి డబ్బు రాకపోవడంతో ప్రైవేటు కాలేజీల నిర్వహణ కూడా కష్టసాధ్యమవుతోంది. అదే వైఎస్ జగన్ ప్రభుత్వంలోనైతే తేదీ చెప్పి మరీ విద్యా దీవెన, వసతి దీవెన వేసేవారు.



నిరుద్యోగులకు పంగనామం

ప్రభుత్వం ఏర్పాటై పది నెలలవుతున్నా జాబ్ క్యాలెండర్ ఊసు లేదు. మెగా డీఎస్సీపై కూడా ప్రకటనలు తప్ప ప్రణాళికలు కనిపించడం లేదు. జిల్లాలో వేలా ది మంది డీఎస్సీ కోసం ఎక్కడెక్కడికో వెళ్లి ప్రిపేరవుతున్నారు. ఇప్పటికే చాలా వరకు ఖర్చు పెట్టారు. ఇంకా ఆలస్యం చేస్తే ఏం చేయాలో తెలీడం లేదని వారు వాపోతున్నారు. పోనీ చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పినట్టు ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇచ్చారా అంటే అదీ లేదు. నిజానికి 1995 నుంచి చంద్రబాబు నిరుద్యోగ భృతి హామీ ఇస్తూనే ఉన్నారు. కానీ ఆ పేరున ఒక రూ.వందైనా ఏనాడూ ఇచ్చిన పాపాన పోలేదు. 2104 లోనూ ఇదే జరిగింది. ఈ మారూ అదే జరుగుతోంది.



వైఎస్ జగన్ హయాంలో ఉద్యోగాల విప్లవం

- రిమ్స్‌తో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో, 108, 104వాహనాల్లో 2199 మందిని నియమించారు.
- కేజీబీవీల్లో 152మందికి ఉద్యోగాలు ఇచ్చారు.
- వైఎస్ జగన్ హయాంలో 7,800 మందికి పైగా సచివాలయాల ఉద్యోగులను నియమించారు.
- 1998 డీఎస్సీలో ఎంపికైన 352మందికి, 2008 డీఎస్సీలో ఎంపికైన 112మందిని టీచర్లు చేశారు. 2018 డీఎస్సీలో ఎంపికైన 620 మందికి ఉద్యోగాలు కల్పించారు.
- విద్యుత్ శాఖలో ఎనర్జీ అసిస్టెంట్లుగా 636 మందిని నియమించారు.
- 12,490మంది వలంటీర్లు ఉండేవారు.

ఉన్నవి పీకేస్తున్నారు



- వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చెప్పి.. ఉన్న పని నుంచి వెళ్లగొట్టారు.
- బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తీసేసి వెక్కిరించారు.
- అరసవల్లి ఆలయంలో 48మంది దినసరి ఉద్యోగులను అయోమయంలో పడేశారు.
- 100కిపైగా మధ్యాహ్న భోజనం కార్మికులను, వందల సంఖ్యలో ఫీల్డ్ అసిస్టెంట్లను, స్వీపర్లను తీసేశారు.
- తమకు నచ్చని రేషన్ డిపో డీలర్లను, అంగన్‌వాడీ కార్యకర్తలను పీకేశారు.

కాలేజీలో అడుగుతున్నారు..



కాలేజీలో చెల్లించాల్సిన ఫీజు కోసం నిత్యం అడుగుతున్నారు. ఇంజినీరింగ్ అకడమిక్ ఇయర్ పూర్తి కావస్తోంది. ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్ చేయలేదు. పరీక్షల సమయంలో ఎలా ఉంటుందో.?

– డి.ఉమామహేశ్వరరావు, బీటెక్ ఫైనలియర్, టెక్కలి

ఇబ్బంది పెట్టవద్దు..



ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెట్టకూడదు. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి.

– ఎస్.మినతి, బీటెక్ తృతీయ సంవత్సరం, టెక్కలి

యువతకు భృతి లేదు



నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. కానీ భృతీ లేదు.. ఉద్యోగ అవకాశాలూ లేవు. డీఎస్సీపై అభ్యర్థులను ఊరిస్తున్నారు.

– డి.నీలకంఠం, ఎమ్మెస్సీ, బీఈడీ, సంతబొమ్మాళి

జాబ్ క్యాలెండర్ ఏదీ..?



జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆ హామీ ఏమైందో తెలియడంలేదు. ఉద్యోగం కల్పించలేని పరిస్థితుల్లో నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామన్నారు. అది కూడా లేదు.

– ఎస్.నర్సింగరావు, ప్రైవేటు ఉద్యోగి

ఉద్యోగాలేవీ..?



ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. ఉద్యోగావకాశాలు కల్పించాలి.

– కె.వి.రమణ, గ్రాడ్యుయేట్, కోటబొమ్మాళి

ఫీజు చెల్లించాలంటున్నారు..



మాకు మొదటి రెండు సంవత్సరాలు విద్యాదీవెన కింద గత ప్రభుత్వం ఫీజులు చెల్లించింది. కానీ ఈ ఏడాది కష్టాలు మొదలయ్యాయి. ఫీజులు చెల్లించమని కాలేజీలో అడుగుతున్నారు.

– పి.పూజిత, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని

నమ్మకం పోతోంది..



డీఎస్సీ నోటిఫికేషన్‌పై నమ్మకం పోతోంది. 117 సవరణ మార్గదర్శకాలతో మిగులు పోస్టులు ఉంటున్నాయని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మాకు ఆందోళనగా ఉంది.

– కొయ్యాన రామారావు, డీఎస్సీ అభ్యర్థి

ఫీజు కష్టాల లెక్కలివిగో....



జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుకోవాల్సిన విద్యార్థుల సంఖ్య	2024-25 విద్యా సంవత్సరానికి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్	ఇప్పటివరకు విడుదలైన డబ్బు	రావాల్సిన మొత్తం
45,657	రూ. 142.34కోట్లు	రూ. 35.58కోట్లు	రూ. 106.75 కోట్లు

● వేడి దాడి



వేడి దాడి అప్పడే ఆరంభమైపోయింది. మధ్యాహ్న మార్తాండుడు నిప్పులు కక్కుతున్నాడు. జిల్లా కేంద్రంలో ఎండలు మండిపోతుండడంతో ఇలా గొడుగు నీడలో బిడ్డను జాగ్రత్తగా తీసుకెళ్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఎట్టకేలకు స్పందించారు



గ్యాస్ సరఫరా చేస్తున్న వజ్రపుకొత్తూరు ఏజెన్సీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

పొందూరు: ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. పొందూరు వాసుల గ్యాస్ కష్టాలపై 'సాక్షి'లో వరుస పెట్టి వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. గ్యాస్ పంపిణీని మంగళవారం నుంచి పొందూరులో ప్రారంభించారు. గత పది రోజులుగా పొందూరు ప్రజానీకం గ్యాస్ కోసం ఇబ్బందులు పడ్డారు. మంగళవారం వజ్రపుకొత్తూరు ఏజెన్సీ సిబ్బంది పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఉన్న కస్టమర్లకు గ్యాస్‌ను సరఫరా చేశారు. బుక్ చేసుకున్న వారు, బుక్ చేసుకోని వారు గ్యాస్ గోడౌన్‌కు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుక్ చేసుకున్న వారి ఇంటి వద్దకు గ్యాస్ సరఫరా మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. మంగళవారం సుమారు 150 మందికి గ్యాస్‌ను సరఫరా చేశామని వజ్రపుకొత్తూరు గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తెలిపారు. రణస్థలం ఏజెన్సీ గ్యాస్ పంపిణీపై ఇంకా స్పందించలేదు.

● కపాసుకుద్ది.. షాక్ కొట్టుద్ది



స్విచ్ ఆన్ చేస్తే షాక్. ఆఫ్ చేసినా షాక్. ప్యానెల్ బోర్డు ముట్టుకున్నా షాకే. సీహెచ్ కపాసుకుద్ది గ్రామమంతా షాక్ కొడుతోంది. ఊరిలోని అభయాంజనేయ వీధి, గంగా మాత వీధుల్లో చాలా రోజులుగా ఈ సమస్య ఉంది. దీంతో కరెంటు బోర్డు వద్దకు వెళ్లాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికే వరుసగా వేలాది రూపాయలు విలువ చేసే టీవీ, మీటర్ బోర్డులు, వైరింగ్, మోటారు ప్యానెల్ బోర్డులు కాలిపోతున్నాయి. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

– కవిటి(ఇచ్ఛాపురం రూరల్)

అధ్యాపకా.. ఇది తగునా..?

ఎచ్చెర్ల క్యాంపస్‌: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ విభాగంలో మంగళవారం అధ్యాపకుల మధ్య వర్గ విభేదాలు బయటపడ్డాయి. విద్యార్థుల ముందే బూతులు తిట్టుకున్న వైనం చర్చనీయాంశమైంది. ఈ విభాగంలో ఒక వ్యక్తి లాంగ్ లీవ్‌లో ఉండగా, మరొకరు అరకొరగా వస్తున్నారు. ఇంకో ఇద్దరు నచ్చిన సమయంలో వస్తున్నారు. దీంతో ఈ విభాగంలో పరిస్థితి ఘోరంగా మారింది. ఇప్పుడు విద్యార్థుల ముందే బూతులు తిట్టుకోవటంతో పక్క విభాగాల అధ్యాపకులు జోక్యం చేసుకొని సర్ది చెప్పారు. ప్రధానంగా ఫేస్ రికగ్నేషన్ యాప్ హాజరు అమలు చేస్తున్నా, ఈ హాజరు వేతనాలు చెల్లింపునకు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో ఒకరి సంతకాలు ఒకరు పెడుతున్నారు. క్లాస్‌లకు హాజరు కాకున్నా వేతనాలు మాత్రం అందరికీ చెల్లిస్తున్నారు. విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన అధ్యాపకులు బహిరంగంగా బూతులు తిట్టుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

దళితులపై వేధింపులు



జేసీబీని అడ్డుకుంటున్న దళితులు

నందిగాం: మండలంలోని పెద్దలవునిపల్లి పంచాయతీ చిన్న లవునిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో స్థానికంగా ఉన్న దళితులను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు వేధిస్తున్నారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా వ్యవహరించామనే నెపంతో కక్ష సాధింపులకు పాల్పడుతున్నట్లు వారు తెలిపారు. గ్రామకంఠంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న పేద దళితుల ఇళ్లను తొలగించి రోడ్డు వేయాలని భావిస్తున్నారు. పంచాయతీ అనుమతి లేదనే నెపంతో వాళ్ల ఇళ్లను తొలగించేందుకు అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. అంతకు ముందు దళిత వీధికి చెందిన వారంతా ఎంపీడీఓకు, తహసీల్దార్‌కు, పంచాయతీ కార్యదర్శికి రహదారి అవసరం లేదని దరఖాస్తు చేసుకున్నారు. అయినా అధికారులు కనికరించకపోగా గ్రామాన్ని సందర్శించి రహదారి ఏర్పాటుకే పూనుకున్నారు. మంగళవారం జేసీబీతో రహదారి ఏర్పాటుకు పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ ఆ ప్రాంతానికి రావడంతో దళితులంతా అడ్డుకున్నారు. దీంతో వారంతా వెనుదిరిగారు.

862 మంది విద్యార్థుల గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ (ఐపీఈ మార్చి-2025) పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా 9వ రోజు మంగళవారం ఫస్టియర్ విద్యార్థులు సెట్-3 ప్రశ్న పత్రంతో ఫిజిక్స్, ఎకనామిక్స్ తదితర పేపర్లకు పరీక్ష రాశారు. జనరల్, ఒకేషనల్ రెండు విభాగాల్లో కలిపి 22,075 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 862 మంది గైర్హాజరయ్యారు. అధికారులు, స్క్వాడ్‌లు విస్తృతంగా తనిఖీలను చేపడుతున్నారు. కాగా మంగళవారం ఫస్టియర్ హిస్టరీ తదితర గ్రూపుల ఫస్టియర్ పరీక్షలు ముగిశాయి.

ప్రగతి లక్ష్యాలు పూర్తి చేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పల్లె పండుగ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచాలని, గృహ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద షెడ్ల నిర్మాణం పూర్తి చేయని 200 పంచాయతీలు వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటి నుంచి పని, పి4 సర్వే, ఎంఎస్‌ఎంఈ సర్వే తదితర అంశాలపై ఆయా అధికారులు సమగ్ర వివరాలు అందించాలన్నారు.

సమీక్షకు ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీఓ ప్రసన్న లక్ష్మి, డీపీఓ భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, డ్వామా పీడీ సుధాకర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

క్లుప్తంగా

ఎత్తిపోతల పథకం సామగ్రి చోరీ



చోరీ జరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవే

ఆమదాలవలస రూరల్: రైతులకు సాగునీరం దించేందుకు ఆమదాలవలస మండలం అక్కులుపేటలో బొడ్డేపల్లి రాజుగోపాలరావు వంశధార కుడిప్రధాన కాలువ 20ఎల్ ఎత్తిపోతల పథకం వద్ద చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి కరెంట్ సరఫరా నిలుపుదల చేసి మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి కాయిల్స్, కరెంట్ ఆయిల్ పట్టుకుపోయారు. పాటు అందులో ఉండే కరెంట్ ఆయిల్ అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న రైతులు, శ్రీనివాసచార్యులుపేట సర్పంచ్ గౌరిపతి ఆమదాలవలస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎస్ బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కమిటీ ఏర్పాటు



బుడుమూరు సూర్యారావు

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం కోసం జిల్లా, డివిజన్ కన్వీనర్లను నియమిస్తున్నట్లు ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మంగళవారం ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా విద్యావేత్త బుడుమూరు సూర్యారావును నియమించారు. ఈయన ప్రస్తుతం బూర్జ మండల ఉపాధ్యక్షునిగా ఉన్నారు. గ్రంథాలయ వ్యవస్థ పట్ల అభిమానం ఉన్నవారినే ఉద్యమ కమిటీలో ఏర్పాటు చేస్తున్నామని, వారి రాజకీయ కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని శివప్రసాద్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ కన్వీనర్‌గా విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్, టెక్కలి డివిజన్ కన్వీనర్‌గా బెండి నర్సింగరావు, పలాస డివిజన్ కన్వీనర్‌గా చాపర వేణుగోపాల్‌ను నియమించారు. సాహితీ ప్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావు, విశ్రాంత లైబ్రేరియన్ డి.గోపాలరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విద్యావేత్త శాసనపురి మధుబాబు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.వి.మల్లేశ్వరరావులను సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ నియామకాలపై రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు, కథానిలయం ప్రతినిధి దాసరి రామచంద్రరావు, శ్రీకాకుళ సాహితీ ప్రతినిధులు, కవులు కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

పరిశ్రమ వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితం



నిరసన తెలుపుతున్న నారువ పంచాయతీ ప్రజలు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో సరాకా లేబొరేటరీ పరిశ్రమ వ్యర్థ జలాలు బయటకు విడిచిపెట్టి భూగర్భ జలాలు కలుషితం చేస్తున్నారంటూ నారువ పంచాయతీ ప్రజలు మంగళవారం ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గతంలో పైపులైన్లు ద్వారా సముద్రంలో విడిచిపెట్టేవారని, కొన్నాళ్లుగా పరిశ్రమ పక్కనే గెడ్డ, కొండదిబ్బ దిగువ ప్రాంతాల్లో విడిచిపెడుతున్నారని చెప్పారు. వ్యర్థ జలాల కారణంగా ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా వ్యర్థాలు పారబోయడం ఆపకపోతే పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో నారువ, అక్కయ్యపాలెం, బోయపాలెం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు ప్రాధాన్యం



శిక్షణ పొందుతున్న అభ్యాసకులు

ఎచ్చెర్ల క్యాంపస్: వచ్చే ఖరీఫ్‌లో జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి తెలిపారు. ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్సుపర్సన్లకు మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 70వేల మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పురుగుల మందులు, రసాయన ఎరువుల రహిత వ్యవసాయం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు, నిపుణులు ఆన్‌లైన్‌లో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు, సిబ్బంది సూర్యనారాయణ, పీఎస్ బాబు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రికి.. నిర్లక్ష్యపు చెదలు

- నిర్వహణను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- వసతుల లేమి..మందుల కొరత



వైద్యుల కోసం వేచి ఉన్న రోగులు



బ్లడ్ శాంపిల్ సేకరిస్తున్న ప్రైవేటు ల్యాబ్ ఉద్యోగిని

కాశీబుగ్గ: ఉద్దానంలో కిడ్నీ మహమ్మారిని కట్టడి చేయడంతో పాటు కిడ్నీ వ్యాధిగ్రస్తులతో అత్యుత్తమ వైద్యసేవలు అందించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్లను ప్రారంభించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమున్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రిపై కూటమి సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. నిర్వహణను గాలికొదిలేసింది. సిబ్బంది కొరత, మందుల లేమి తదితర సమస్యలతో కిడ్నీ బాధితులు సతమతమవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. ఉద్దాన కిడ్నీ బాధితులకు సేవలు అందిస్తున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో సేవలు మృగ్యమవుతున్నాయి. గత ఎనిమిది నెలల వ్యవధిలో సర్కారు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుండటంతో ఇరవై ఐదు మందికిపైగా మరణించినట్లు సమాచారం. మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు తప్ప మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయి..తదితర కారణాలను పట్టించుకునే వారే కరువయ్యారు.

ఇవీ సమస్యలు..

- పలాస కిడ్నీ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. కిడ్నీ వ్యాధి నిపుణులు ఒక్కరే కావడంతో అతని కోసం వేలాది మంది రోగులు వేచి ఉండాల్సిన పరిస్థితి.
- గత ప్రభుత్వంలోనే పూర్తిస్థాయి మెషీన్లు సిద్ధం చేసినా ప్రస్తుత ప్రభుత్వం ఆపరేటర్లను ఇంతవరకు నియమించలేదు. దీంతో బయటే పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది.
- ఆస్పత్రిలో అరకొరగా మందులు మాత్రమే అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో 40 రకాల



మాత్రలు మందులు అందించేవారు. ఇప్పుడు 23 రకాలు అందిస్తున్నా అందులో చాలావరకు స్టాకు లేదు. స్కానింగ్, ఇంజక్షన్లదీ అదే పరిస్థితి.
- ఇన్‌పేషెంట్‌కు డైట్ ఇవ్వడం లేదు. వారం నుంచి పది రోజులు ఉండాల్సిన వ్యాధిగ్రస్తులు, వారికి సహాయంగా వచ్చేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.

మందులు ఇవ్వడం లేదు..



కిడ్నీ సమస్యకు సంబంధించిన మాత్రలు ప్రభుత్వం ఇవ్వమని రెండు వారాలుగా అడుగుతున్నా ప్రభుత్వం సరఫరా చేయడం లేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి పలాస కిడ్నీ ఆసుపత్రికి పూర్తి స్థాయిలో మందులు అందుబాటులోకి తీసుకురావాలి.

– పిట్ట నీలయ్య, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, కోసంగిపురం కూడలి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆసుపత్రిలో డైట్ ఇవ్వకపోవడం వాస్తవమే. వైద్యులు, మిషన్ ఆపరేటర్లు, ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉంది.

– డాక్టర్ అల్లు పద్మజ, సూపరింటెండెంట్, కిడ్నీ పరిశోధన కేంద్రం, పలాస

సహజ రంగులు.. కేరాఫ్ దివ్యాంగులు



పూలరెక్కలను ఎండబెడుతున్న దివ్యాంగులు



తాము మానసికంగా ఎదగకపోయినా తమ ఆలోచనలు ఉన్నతమైనవని నిరూపించారు ఆ మానసిక దివ్యాంగులు. హోలీ పండగ సందర్భంగా పర్యావరణహితమైన రంగులను తయారు చేసి అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. రసాయనాలకు స్వస్తి పలికి పూలతో సహజసిద్ధమైన రంగులు తయారు చేసి ఉన్నత ఆలోచనల్లో తాము ఎవరికీ తీసిపోమని సమాజానికి చాటి చెబుతున్నారు.

- పూలతో పర్యావరణ హితమైన **రంగుల తయారీ**
- అబ్బురపరుస్తున్న మనోవికాస కేంద్రం దివ్యాంగులు
- 14న హోలీ వేడుకలకు రంగులు సిద్ధం

శ్రీకాకుళం కల్చరల్ : రంగుల కేళీ హోలీ పండుగ సమీపిస్తోంది. ఈ నెల 14న జరిగే ఆనందాల వేడుకకు ఇప్పటికే తాత్కాలిక రంగుల దుకాణాలు సిద్ధమయ్యాయి. అయితే రసాయనాలతో తయారుచేసే కృత్రిమ రంగులు కాకుండా పర్యావరణ హితమైన రంగులు వాడాలని పర్యావరణవేత్తలు ఎప్పటి నుంచో విజ్ఞప్తులు చేస్తున్నా అలాంటి రంగులు ఎలా తయారవుతాయో..అవి ఎక్కడ దొరుకుతాయో చాలామందికి తెలియదు. ఈ నేపథ్యంలో రసాయనాలు లేని రంగులు తయారు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు జిల్లా కేంద్రంలో ఉంటున్న బెహరా మనోవికాస కేంద్రంలోని దివ్యాంగులు. అందమైన, పర్యావరణానికి హాని చేయనటువంటి రంగులను స్వహస్తాలతో తయారు చేస్తున్నారు.



రంగులను ప్యాకెట్ల రూపంలో సిద్ధం చేస్తూ..

పూలరెక్కలతో..

హోలీ రంగులు పర్యావరణానికి హాని చేయకుండా ఉండడానికి రసాయనాలు లేకుండా కేవలం పూల రెక్కలతోనే ఇక్కడ సహజ సిద్ధమైన రంగులు తయారు చేస్తున్నారు. 74మంది మానసిక దివ్యాంగులు ఈ రంగుల రూపకల్పనలో పాలుపంచుకుంటున్నారు. ముందుగా వివిధ రకాల పూల రెక్కలను ఆరబెడతారు. అవి పూర్తిగా ఆరాక రంగుల వారీగా విడదీసి యంత్రంలో వేసి పొడర్‌గా చేస్తున్నారు. వాటిని చిన్నచిన్న ప్యాకెట్లలో కట్టి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. కేంద్రంలో మానసిక దివ్యాంగులు తయారు చేసిన సహజ సిద్ధమైన రంగులు, ఇతర ఉత్పత్తులతో ఎగ్జిబిషన్ సైతం ఏర్పాటు చేశారు. వీటిని కొనుగోలు చేయడం ద్వారా మానసిక దివ్యాంగులను ప్రోత్సహించిన వారవుతారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం



దివ్యాంగుల సృజనకు మా వంతు ప్రోత్సాహం ఇస్తున్నాం. పూలతో సహజ సిద్ధంగా తయారు చేసిన ఈ రంగులు ప్యాకెట్ రూ.30 నుంచి మొదలుకుని సెట్ రూ.150 వరకు విక్రయిస్తున్నాం. దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ఎవరైనా కొనుగోలు చేయాలంటే కేంద్రంలో సంప్రదించవచ్చు.

– శ్యామల, బెహరా మనోవికాస కేంద్రం నిర్వాహకులు, పాత హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీకాకుళం

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, పార్టీ నాయకులు

ఆమదాలవలస: సంక్షేమం, అభివృద్ధి అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని దుయ్యబట్టారు. సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చకుండా నయవంచన పాలన చేస్తోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.3600 కోట్లు బకాయిలు ఉంటే ఇటీవల బడ్జెట్లో రూ. 2,600 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు నేరుగా వారి ఖాతాలోకి సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు.

- రాష్ట్ర కాళింగ సామాజిక వర్గం అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు (రామారావు)మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై యువత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కూటమి పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఇటీవల జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వారి పాలనకు నిదర్శనమన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగే యువతకు పోరుకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆమదాలవలస మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామమూర్తి, పొందూరు మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ విజ్ఞాన దినోత్సవ పోటీలు



రొంపివలస బృందానికి బహుమతులు అందజేస్తున్న కాంతారావు, తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవ పోటీలు ముగిశాయి. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో శ్రీకాకుళం, టెక్కలి, పలాస మూడు డివిజన్ల పరిధిలో విజేతలగా నిలిచిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక, సెకండరీ విభాగాల్లో క్విజ్, ఎక్స్‌పెర్‌మెంట్, సింపోసియం (విశ్లేషణాత్మక చర్చ) అంశాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు, డీఈఓ తిరుమల చైతన్య బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్రీయమైన దృక్పథాలను అలవర్చుకోవాలని, పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అంతకుముందు కార్యక్రమ కో–ఆర్డినేటర్, శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి పోటీలను పర్యవేక్షించారు. వీటి కొనసాగింపుగా జరిగే రాష్ట్రస్థాయి విజ్ఞానశాస్త్ర దినోత్సవ పోటీలు (తేదీలు ఖరారుకాలేదు) శ్రీకాకుళంలోనే జరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి(టెక్కలి)పి.విలియమ్స్, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి, సైన్స్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలు వీరే..


క్విజ్: ప్రాథమిక స్థాయిలో ఎంపీపీ స్కూల్ గంగువాడ, ఎంపీపీ స్కూల్ నందిగాం మెయిన్, ఎంపీపీ స్కూల్ పెద్దలంకాం మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. సెకండరీ స్థాయిలో జెడ్పీహెచ్ స్కూల్ కొయ్యాం, జెడ్పీహెచ్‌స్కూల్ ప్లస్ హరిపురం, జెడ్పీహెచ్ స్కూల్ బోరివంగ తొలి మూడుస్థానాలు సాధించాయి.

ఎక్స్‌పెర్‌మెంట్: ప్రాథమిక స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో జెడ్పీహెచ్ స్కూల్ కోటబొమ్మాళి, ఎంజేపీ డబ్ల్యూఆర్‌జీ స్కూల్ హయాతీనగరం, జెడ్పీహెచ్ స్కూల్(బోర్డు) నరసన్నపేట మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.


సింపోసియం: సెకండరీ స్థాయిలోనే జరిగిన ఈ పోటీల్లో జెడ్పీహెచ్ స్కూల్ రొంపివలస, జెడ్పీహెచ్ స్కూల్ కొసమాల, జీహెచ్ స్కూల్ కవిటి పాఠశాలలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.

లోయలో పడి ఇద్దరు మృతి

- ఒడిశాలో దుర్ఘటన
- మృతులు సూదికొండ వాసులు



బుట్ట గంగాధర్ మృతదేహం



సయ్యద్ ఫరీద్ మృతదేహం

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ అర్సిలింగి ఘాట్ వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండకు చెందిన ఇద్దరు మృత్యువాతపడ్డారు. సూదికొండకు చెందిన ముగ్గురు కొయంపూర్‌కు వ్యక్తిగత పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి లోయలో పడిపోయినట్లు తెలిసింది. ఈ ఘటనలో సూదికొండకు చెందిన సయ్యద్ ఫరీద్ (27) అక్కడికక్కడే మృతిచెందగా, బుట్ట గంగాధర్ (35) గజపతి జిల్లా పర్లాఖిమిడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. గంగాధర్ భార్య బుట్ట సరళకు తీవ్ర గాయాలు కావడంతో బరంపురం పెద్దాసుపత్రికి చికిత్స అందిస్తున్నారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బాధిత కుటుంబాలకు అప్పగించనున్నారు. గారబంద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీ గణేష్ చిట్స్ యజమానుల ఆస్తుల జప్తు



కోరాడ గణేశ్వరరావు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు (ఫైల్)

నరసన్నపేట: నరసన్నపేటలో లక్ష్మీ గణేష్ చిట్స్ సంస్థకు చెందిన యజమానుల ఆస్తులను జప్తు చేస్తూ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జీఓ నంబరు 46 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో చిట్ ఫండ్ వ్యాపారి కోరాడ గణేశ్వరరావు, ఆయన భార్య కోరాడ లక్ష్మి, బంధువులు అంధవరపు సూర్యనారాయణమూర్తి, అంధవరపు భారతిల పేరిట ఉన్న ఆస్తులను జప్తు చేస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. స్థానిక కలివరపుపేటలో నివసిస్తున్న గణేశ్వరరావు 2021 జూన్ 30న కుటుంబంతో సహా పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేయగా.. అనంతరం కేసు సీఐడీకి అప్పగించారు. సీఐడీ అదనపు ఎస్పీ రవివర్మ నరసన్నపేటకు పలుమార్లు వచ్చి వివరాలు సేకరించారు. అప్పటి వరకూ తప్పించుకు తిరుగుతున్న గణేష్, భార్య, బంధువులను అరెస్టు చేశారు.తాజాగా ఆస్తుల జప్తుకు ఆదేశాలు జారీ అయ్యాయి. నిందితులు రూ.2.5 లక్షలు, రూ.5 లక్షలు, రూ.10 లక్షలు చిట్టీలను నడిపి 48 మంది బాధితల నుంచి రూ.3.26 కోట్లు, మరో 26 మంది బాధితుల నుంచి రూ. 2.59 కోట్లు డిపాజిట్లు రూపంలో సేకరించినట్లు తేలింది.

కార్గో ఎయిర్‌పోర్టును అడ్డుకుందాం



ప్రచార యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: పచ్చని ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఈ నెల 18, 19 తేదీల్లో బాధిత ప్రాంతాలలో చేపట్టనున్న ప్రచార యాత్రను విజయవంతం చేయాలని ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులో మంగళవారం వామపక్ష పార్టీలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతాన్ని నమ్ముకొని వేలాది మంది ప్రజలు జీవనోపాధి పొందుతుంటే ప్రభుత్వం ఈ ప్రాంతంలో విధ్వంసకర ఎయిర్ పోర్టుతో వారి బతుకులను నాశనం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేయాలంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ అధ్యక్షుడు వాసుదేవరావు, సీపీఐ(ఎం.ఎల్) కార్యదర్శి చాపర వేణుగోపాల్, న్యూ డెమొక్రసీ నాయకులు వంకల మాధవరావు, జోగి అప్పారావు, ఎల్.రామస్వామి, రామ్మూర్తి, ధనుంజయ, గుంటు రామారావు, జోగి శ్రీదేవి, వల్లభరావు, మైనపల్లి శేఖరం, గుంటు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు సోంపేటలో జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), సీడాప్ సంయుక్తంగా ఈ నెల 13న సోంపేటలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల్లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డ్రైవర్, వెహికల్ క్లీనర్ వంటి ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, డిగ్రీ విద్యార్హత కలిగిన 19 నుంచి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి రూ.11,000 నుంచి రూ.19,500 వరకు వేతనం లభిస్తుందని వివరించారు. పూర్తి వివరాలకు 81065 08318 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు



ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: బ్యాంక్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు మంగళవారం శ్రీకాకుళం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, అధికారులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులపై ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నాచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐబోక్ రీజనల్ కార్యదర్శి కె.తేజేశ్వరరావు, కో–ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు గిరిధర్ నాయక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల ఉపాధ్యక్షురాలు జి.కరుణ, ఇండియన్ బ్యాంక్ మహిళా కన్వీనర్ శ్రావణి, కో–ఆర్డినేషన్ జాయింట్ కార్యదర్శి ఎ.సూర్య, ఓబీసీ ఉద్యోగ సంఘ నాయకులు సూర్యకిరణ్, నరేష్ శ్రీనివాస్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్చి 24, 25 తేదీలలో సమ్మె

శ్రీకాకుళం అర్బన్: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో దాదాపు పది లక్షలమంది ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఈ నెల నెల 24, 25 తేదీల్లో సమ్మెకు దిగుతున్నట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. యూనియన్ శ్రీకాకుళం కన్వీనర్ కేసీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళం పెద్దపాడు రోడ్డులోని ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సమ్మె ఉద్దేశం, ప్రధానమైన డిమాండ్లను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రెటరీ కృష్ణకిషోర్, లోకల్ సెక్రటరీ నాయుడు, ఐబోక్ కిషోర్, బెఫి మండ శ్రీనివాసరావు, ఏఐబీఈఏ శ్రావణి పాల్గొన్నారు.